RNI NO. APTEL/2014/58326

నవతరం

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 102 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

17-02-2026 మంగళవారం వెల : 1 /- పేజీలు : 4


# బిల్ గేట్స్‌తో విజయవాడ నుండి జిల్లా కలెక్టర్లతో వర్చువల్ సమావేశం






2లో

## రహదారి భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి



- మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి - అదనపు ఎస్పీ కెవి రమణ 2లో

# బడ్జెట్ అంతా అంకెల గారడీనే

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ నేల విడిచి సాము చేసిన చందంగా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత తమ్మినేని చిరంజీవి నాగ్ ఆరోపించారు



**నవతరం-ఆమదాలవలస**

సోమవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.అధికార కూటమి ప్రభుత్వం మూడోసారి ప్రవేశపెట్టిన బడ్జెట్ "అంకెల గారడీని తలపిస్తోందని" ఆక్షేపించారు.మొత్తం రూ.3,32,205 కోట్ల వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వం,రూ.75,868 కోట్ల ద్రవ్యలోటు,రూ.22 వేల కోట్ల రెవెన్యూ లోటు చూపడం ఆర్థిక అసమతుల్యతకు నిదర్శనమన్నారు.రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు,పన్నుల రూపంలో అందాల్సిన ఆదాయం,వాస్తవిక ఆర్థిక పరిస్థితులు వంటి అంశాలను పక్కనపెట్టి ఊహాజనిత అంచనాలతో బడ్జెట్ రూపొందించారని విమర్శించారు. ఓపెన్ మార్కెట్ ద్వారా రూ.76,182 కోట్లు, కేంద్రం నుంచి రూ.19,033 కోట్లు కలిపి దాదాపు రూ.97 వేల కోట్లు అప్పు చేయాలని ప్రతిపాదించడం రాష్ట్రాన్ని మరింత అప్పుల బారిన పడేసే చర్యగా అభివర్ణించారు.ఇప్పటికే మూడు లక్షల కోట్లకు పైగా అప్పులు చేసిన ప్రభుత్వం,ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల్లో దేశంలో నెంబర్ వన్‌గా నిలబెట్టిందని ఆరోపించారు.గత ప్రభుత్వ కాలంలో తీసుకున్న అప్పుల ద్వారా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ పథకాల కింద ప్రజల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేశామని గుర్తుచేశారు.అయితే ప్రస్తుత ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో చేసిన భారీ అప్పులతో ఏ పథకాలు అమలు చేశారో ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

# టెక్కలిలో 50 పడకల ఆయుష్ ఆసుపత్రి

- 15 కోట్లతో నిర్మించేందుకు ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృషికి ఫలితం



**నవతరం -టెక్కలి**

శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో 50 పడకల సామర్థ్యంతో సమగ్ర ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రూ.15 కోట్ల వ్యయంతో ఈ కీలక ప్రాజెక్టును నిర్మించేందుకు ఆయుష్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ కె దినేష్ కుమార్, ఐఏఎస్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ హాస్పిటల్ కార్యరూపం దాల్చడం పూర్తిగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారి నిరంతర కృషి, దూరదృష్టి మరియు సమర్థ నాయకత్వం వల్లనే సాధ్యమైంది. జాతీయ ఆయుష్ మిషన్ కింద కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి గరిష్ట నిధులు రాబట్టడంలో మంత్రి అచ్చెన్నాయుడు గారు కీలక పాత్ర పోషించారు. గ్రామీణ, దూర ప్రాంత ప్రజలకు ఆయుష్ వైద్య సేవలు మరింత చేరువ కావాలనే సంకల్పంతో టెక్కలిని ఆయుష్ వైద్య కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ ఆసుపత్రి ప్రతిపాదనను ముందుకు తీసుకువచ్చారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఆయుష్ శాఖ అధికారులు అవసరమైన పరిపాలనా చర్యలను పూర్తి చేసి ఉత్తర్వులు ఇచ్చారు. ఘ్రానూ, చీూవీ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ఆధునిక సౌకర్యాలతో ఆసుపత్రి నిర్మాణం -మిగతా 2లో

# అప్పుల ఊబిలోకి నెట్టే బడ్జెట్

- అన్ని వర్గాలను మోసగించిన కూటమి సర్కార్
- విద్య, వైద్యం, వ్యవసాయ, సాగునీటి వనరులు ప్రాధాన్యత ంబడ్జెట్ ఎక్కడ?
- సూపర్ సిక్స్ హామీలు ఏవి?
- బడ్జెట్ కేటాయింపులు కాగితాలకే పరిమితమా !
- వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు

2లో



# మణిపాత్రునికి "సాహితీ శిరోమణి" బిరుదు

- శివరాత్రి సందర్భంగా బాపూజీ కళామందిర్‌లో ఘన సత్కారం
- శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో సిక్కోలు సాహితి సంబరం
- జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా బిరుదు ప్రదానం
- దేశవ్యాప్తంగా కవి పండితుల హాజరు
- ఇది తనకు 988వ సన్మానం అని నాగేశ్వరరావు వ్యాఖ్య



**నవతరం - శ్రీకాకుళం**

శ్రీకాకుళం: స్థానిక బాపూజీ కళామందిర్‌లో శివరాత్రి పర్వదినాన నిర్వహించిన సిక్కోలు సాహితి సంబరంలో మణిపాత్రుని నాగేశ్వరరావు గారికి "సాహితీ శిరోమణి" బిరుదు ప్రధానం చేస్తూ ఘనంగా సత్కరించారు. శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కార్యదర్శి పార్థసారథి చేతుల మీదుగా బిరుదు ప్రదానం జరిగింది.

ఈ కార్యక్రమంలో విశ్రాంత డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, సదాశివని తిరుమల చైతన్య, శ్రీశ్రీ కళావేదిక ఉత్తరాంధ్ర అధ్యక్షులు డి. గోవిందరావు, కన్వీనర్ భోగిల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ముట్నూరు ఉపేంద్ర శర్మ, ఇద్దిపాపయ్య, పల్లె తేజ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుండి కవి, పండితులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇది తనకు 988వ సన్మానమని, తనకు బిరుదు అందజేసి సత్కరించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన విభూతి



**నవతరం - శ్రీకాకుళం**

శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ హనుమంతు కూర్మారావును 31వ డివిజన్ ఇంచార్జ్, ఏపీ ప్రభుత్వం కనీస వేతన మండలి డైరెక్టర్ విభూతి సూరిబాబు స్థానిక నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఈ సందర్భంగా సూరిబాబు కమిషనర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.నగర అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, సామాజిక నాయకులు సహకారం అందించాలని కమిషనర్ కోరారు. దీనిపై స్పందించిన సూరిబాబు, నగర అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అలాగే డివిజన్‌లో పెండింగ్ పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.భేటీ సౌహార్ద వాతావరణంలో సాగగా, స్థానిక సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఇరువురు చర్చించారు.

ఎడిటోరియల్

# కేంద్రం వివక్ష

తెలంగాణ ఆర్థిక ప్రయోజనాలకు దెబ్బ తగులుతోంది.

'సొమ్మొకరిది.. సోకొకరిది' అన్నట్టుగా ప్రధాని మోడీ నేతృత్వంలోని బీజేపీ సర్కారు వ్యవహరిస్తున్నది. గత పదేండ్లుగా కత్తిగట్టి సమాఖ్య వ్యవస్థకు తూట్లు పొడుస్తూ రాష్ట్రాలను ఆర్థికంగా దివాళా తీయిస్తున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉండాల్సిన సఖ్యత, సమన్వయానికి తూట్లు పొడుస్తున్నది. ఆర్థిక వివక్షతను దేశంలోని ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య విపరీతంగా అమలు చేస్తున్నది. తాను చేసిన జీఎస్టీ చట్టాన్ని తానే ఉల్లంఘిస్తూ, పన్నులు అధికంగా చెల్లించే రాష్ట్రాలకు ఎక్కువ మొత్తంలో నిధులివ్వకుండా కోతపెడుతున్నది. కక్షతో సాధారణ నిధులతోపాటు కేంద్రం ప్రాయోజిత పథకాలకు ఎసరుపెట్టి రాష్ట్రాలపై ఉక్కు పాదం మోపుతున్నది. ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎనిమిది మంది ఎంపీలను ఇచ్చిన రాష్ట్రాన్ని నిలువునా ఎండబెడుతున్నది. లేబర్‌కోడ్‌ల పేరుతో ఇప్పటికే పేద ప్రజల పథకాలు, కార్మిక చట్టాలను చెరబట్టింది. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నది. 'మేము చెప్పినట్టు చేస్తేనే మీకు రొక్కం' ఇస్తామంటూ రాజ్యాంగం సాక్షిగా అల్టీమేటమ్ ఇస్తున్నది. 2018-19 నుంచి 2022-23 వరకు ఐదేండ్ల కాలంలో కేంద్రానికి రాష్ట్రాల నుంచి అందిన పన్నులు రూ.90.80 లక్షల కోట్లయితే, ఇందులో దక్షిణాది నుంచి రూ.22.86 లక్షల కోట్లు సమకూరాయి. కాగా అందులో నుంచి తిరిగి ఇచ్చింది రూ. 16.3 లక్షల కోట్లే కావడం గమనార్హం.

దక్షిణాది రాష్ట్రాలకు రూపాయికి 30 పైసలు మాత్రమే ఇస్తూ, బీహార్, ఉత్తరప్రదేశ్‌కు మాత్రం రూపాయికి రూ.4 చొప్పున మంజూరివ్వడం అక్షరాలా నగసత్యం. ఆ రాష్ట్రాల నుంచి వచ్చే పన్నులకన్నా మూడింతలు అదనంగా అక్కడ ఖర్చుచేస్తుండటం అంతులేని వివక్షకు తార్కాణం. 2024-25లో తెలంగాణ నుంచి పన్నులు రూ.1,33,208 కోట్లు వసూలైతే, ఆ రాష్ట్రానికి రూ.51,725 మాత్రమే విడుదల చేసినట్టుగా పార్లమెంటు సాక్షిగా కేంద్ర మంత్రి సెలవియ్యడాన్ని బట్టి పరిస్థితిని అర్థంచేసుకోవచ్చు వివక్ష ఎంతటిదో. జీఎస్టీ చట్టాన్ని సవరించడం ద్వారా స్లాబులను తగ్గించిన నేపథ్యంలో తెలంగాణ రూ.8 వేల కోట్లు నష్టపోయిందని రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లోనే ప్రకటించిన సంగతి జగమెరిగిన ముచ్చట. ఆర్థిక సంఘాలు సూచించిన మార్గదర్శకాలనూ కేంద్రం పక్కనబెట్టడంతో రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యం అడకత్తెరలో పొక్కచెక్కలా మారుతున్నది.ప్రభుత్వ శాఖలు, రంగాల వారీగా రాష్ట్రాల ప్రత్యేక గ్రాంట్లకు కత్తెరపెట్టడం మూలంగా తెలంగాణకు రూ.5 వేల కోట్లు నష్టం వచ్చే అవకాశముందని సాక్షాత్తు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మీడియాకెక్కడమే కేంద్రం ఆర్థిక వివక్షకు రుజువు.

అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిన తెలంగాణ సర్కారు, కేంద్రం వైఖరితో ఆర్థిక ఒడిదుడుకు లను ఎదుర్కొంటున్నది. నిధులివ్వకపోవడమేగాక ఇటీవల కేంద్ర బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి గుండుసున్నా పెట్టింది. మెజారిటీ ప్రజలు, పేదలకు అక్కర్లేని హైస్పీడ్ రైళ్లను మంజూరుచేసి గొప్పలకు పోతున్నది. రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, కేంద్రమంత్రులు గొర్రె పొకడే తప్ప శాస్త్రీయ అభివృద్ధి ఆలోచన లేకపోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. కీలెరిగి వాతపెట్టక మానరు. ప్రజల మధ్య మత చిచ్చుపెట్టి ఎన్నికల్లో పబ్బం గడుపుకోవడానికి అలవాటుపడ్డ ఆ పార్టీకి, గుణపాఠం నేర్పేరోజులు దగ్గర్లోనే ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణ ఇప్పటికే రూ.8.5 లక్షల కోట్ల అప్పుల్లో మునిగింది. కేంద్రం నుంచి రావాల్సిన రూ. 50 వేల కోట్ల నుంచి రూ. 60 వేల కోట్ల రొక్కం ఇంకా పెండింగ్‌లోనే ఉండటం అన్యాయం. నిధుల కోసం సీఎం, డీప్యూటీసీఎం, మంత్రులు, ఉన్నతాధికారులు ఢిల్లీ చుట్టూ తిరిగి ఇచ్చిన వినతిపత్రాలను కేంద్రం చెత్తబుట్టలో పడేసింది. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ ఇష్టానుసారం వ్యవహరిస్తున్న కేంద్రంపై దక్షిణాది రాష్ట్రాలు పోరాటం చేయకపోతే తీవ్రంగా నష్టపోయే అవకాశాలెక్కువ. కేరళలో రైతులకు బోనస్ ఇవ్వొద్దంటూ అక్కడి వామపక్ష సర్కారును వేధిస్తున్నది, బెదిరిస్తున్నది. మెతకగా వ్యవహరిస్తే బీజేపీయేతర రాష్ట్రాలు వాటిలోని ప్రజలు అనేక కష్టాలకు గురవుతాయి. అందుకు ఆయా రాష్ట్రాలు ఐక్యంగా తమ హక్కుల కోసం పోరాడి సాధించుకోవాలి.

# అప్పుల ఊబిలోకి నెట్టే బడ్జెట్

**నవతరం -పలాస)**

కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2026 - 27 బడ్జెట్ రాష్ట్రాన్ని మరింత అప్పుల ఊబిలోకి నెట్టే వేసే విధంగా ఉందని వైయస్సార్సీపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు ధ్వజమెత్తారు. సోమవారం ఆయన పలాసలో తన స్వగృహంలో రాష్ట్ర బడ్జెట్ పై మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడవ బడ్జెట్ 3,32,205 కోట్ల రూపాయలతో వివిధ రంగాలకు కేటాయింపులు చేసినట్లు బడ్జెట్ ప్రవేశ పెట్టినప్పటికీ, ఆచరణలో అసాధ్యమన్నారు. గత వైయస్సార్సీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన బడ్జెట్లలో వేసిన అంచనాలకు తగ్గ రాబడి వచ్చేదని, ఫలితంగా బడ్జెట్ కేటాయింపులు దాదాపు పూర్తిగా అమలు చేయగలిగారని, అదే కూటమి ప్రభుత్వంలో అంచనాలకు తగిన రాబడి లేకపోవడంతో,ఏదో ప్రజలకు మభ్య పెట్టేందుకు కాగితాలతోనే కేటాయింపులు చేసి, అంకెల గారిడి చూపిస్తుందని బమ్మిడి దుర్యోధనరావు ఆరోపించారు. ఈ బడ్జెట్లో అన్నదాతను ఆదుకునే యోచన లేదని చెప్పడానికి, ఎన్నికల సమయంలో రైతులకు ఏడాదికి 20 వేల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ మొదటి ఏడాది ఆ ఊసే లేదని, ఈ బడ్జెట్లో ' పి ఎం కిసాన్ ' నిధులతో కలిపి రెండు విడతల్లో 6,309,44 కోట్లు ఇచ్చామని కూటమి సర్కార్ చెప్పినప్పటికీ, 2026- 27 ఆర్థిక సంవత్సరానికి గాను 6,600 కోట్లు కేటాయించినప్పటికీ, మూడో విడత నిధులపై స్పష్టత లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో లబ్ధి పొందిన 53.58 లక్షల మంది రైతులకు ఒక్కో కుటుంబానికి 20 వేల రూపాయలు చొప్పున ఇవ్వాలంటే రాష్ట్ర ప్రభుత్వమే 10,716 కోట్లు కేటాయించవలసి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం గత ఏడాది ధాన్యం ఉత్పత్తి 78.5 లక్షల టన్నులు కాగా , ఈ ఏడాది అది 70 లక్షల టన్నులకు పడిపోయిందని, అయితే కూటమి ప్రభుత్వం భారీగా కొనుగోలు చేస్తున్నామని చెప్పుకుంటున్నా గానీ, ధాన్యం క్వింటాలకు 300 రూపాయల చొప్పున నష్టానికి అన్నదాతలు అమ్ముకుంటున్నారని బమ్మిడి దుర్యోధనరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ రైతులకు తీవ్ర నిరాశ ను మిగిల్చిందని, ధరల స్థిరీ కరణ నిధిని కేవలం రూ. 500 కోట్లకు పరిమితి చేయడం దారుణం అన్నారు. రాష్ట్ర బడ్జెట్లో పేదలకు ప్రాధాన్యత లేకుండా పోయిందని, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిబిఎస్ ఈ కోర్సులను కూడా చేపట్టలేక రద్దు చేయడం చూస్తుంటే పేద పిల్లలకు సీబీఎస్ఈ చదువులు అక్కర్లేదన్నట్లు ఉందని, అదేవిధంగా నిరుద్యోగులకు ఇచ్చిన హామీని, మహిళలకు రూ. 1500 ప్రతినెలా ఇస్తామన్న హామీని విస్మరించారని ఆయన విమర్శించారు. బడ్జెట్ లో నిరుద్యోగ భృతి కి నిధులు కేటాయించలేదని, జాబు క్యాలెండర్ ఇస్తామని చెప్పారని, కానీ ఇంతవరకు జాబ్ క్యాలెండర్ అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

అదేవిధంగా ప్రజారోగ్యం కూడా బడ్జెట్లో విస్మరించారని, ఒక్క మాటలో చెప్పాలంటే అన్ని వర్గాలను బడ్జెట్లో కూటమి ప్రభుత్వం విస్మరించిందని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రాన్ని మరింత అప్పుల ఊబిలోకి నెట్టేసి దిగా ఉందన్నారు. ఎన్నికలలో స్వార్థ ప్రయోజనాల కోసం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అధికారంలోకి వచ్చాక అమలు చేయలేదని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ఇలా అంకెల గారడీతో ప్రజలను మోసం చేయడం తప్పా బడ్జెట్లో ప్రజలకు మేలు చేసే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేయలేదని బమ్మిడి దుర్యోధనరావు స్పష్టం చేశారు.

# రహదారి భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి

**నవతరం - శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఐపిఎస్ ఆదేశాల మేరకు రహదారి భద్రత, మత్తు పదార్థాలు పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.ఈ సందర్భంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో "రహదారి భద్రత నియమాలు పాటించండి - మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి,(డ్రగ్స్ వద్దు బ్రో)" అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌ను అదనపు ఎస్పీ కెవి రమణ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని పిలుపునిచ్చారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు కు అలవాటు పడడం ద్వారా వారి జీవితం అందాకారంగా మారటం మారటం తో పాటు వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. రహదారి ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో కీలకమని తెలిపారు. వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమాలు పాటించడం, హెల్మెట్/సీట్‌బెల్ట్ ధరించడం, అధిక వేగం నివారించడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపడం లేదా ఇతర మత్తు పదార్థాల ప్రభావంలో డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రహదారి భద్రత, డ్రగ్స్ నియంత్రణ పై అన్ని పాఠశాలలు కళాశాలలో పాటుగా పబ్లిక్ ప్రదేశాలలో పోస్టర్లను అతికించి మరింత అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వి రామారావు, జిల్లా డి.టి.ఆర్.బి విభాగం సబ్ ఇన్స్పెక్టర్ సురేష్, సామాజిక కార్యకర్త వంగపండు రవికుమార్ పాల్గొన్నారు.

# బిల్ గేట్స్‌తో విజయవాడ నుండి జిల్లా కలెక్టర్లతో వర్చువల్ సమావేశం

**నవతరం - శ్రీకాకుళం**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బిల్ గేట్స్ తో విజయవాడ నుండి జిల్లా కలెక్టర్లతో వర్చువల్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర విజన్-2047 నాటికి సాదించబోయే లక్ష్యాలను, తదితర అంశాలపై వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యా, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మాట్లాడారు. విజయవాడ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, రాష్ట్ర మంత్రులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరం నుండి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పాల్గొనగా, జిల్లా అధికారులు డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్, జడ్పీ సీఈవో సత్యనారాయణ, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వేణుగోపాల్, సిపిఓ లక్ష్మీ ప్రసన్న, డిపిఓ కె. భారతి సౌజన్య, డిప్యూటీ కలెక్టర్ లావణ్య, డిఎస్ఓ సూర్య ప్రకాష్, ఎపిఎంఐపి డిడి శ్రీనివాసరావు, మత్స్య శాఖ డిడి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఆమదాలవలస నియోజకవర్గంలో రోడ్లకు మహర్దశ

**నవతరం -బూర్జ**

ఆమదాలవలస నియోజకవర్గ అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. బూర్జ మండలంలోని కొల్లివలస వయా గుత్తావిల్లి, ఆముదాలవలస మండలంలోని అక్కులపేట గ్రామం వరకు నిర్మించనున్న బీటీ రహదారికి ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ సోమవారం శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ రహదారుల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. కొల్లివలస-అక్కులపేట మధ్య బీటీ రహదారి నిర్మాణంతో రెండు మండలాల ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు సులభంగా ప్రయాణించగలరని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని చెప్పారు. ఈ రోడ్డు



నిర్మాణంతో ఈ ప్రాంత రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు త్వరగా సులభంగా తరలించగలరని, అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు చేరుకోవడం సులభతరమవుతుందన్నారు.

గ్రామాల మధ్య అనుసంధానం బలపడటంతో అభివృద్ధి వేగవంతమవుతుందని తెలిపారు. ప్రజలకిచ్చిన హామీలను అక్షరాలా నెరవేర్చే దిశగా తాము కృషి చేస్తున్నామని, ఆమదాలవలస నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లడమే తన లక్ష్యమని కూన రవికుమార్ పేర్కొన్నారు. ప్రజల సహకారం, ఆశీస్సులు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్దసంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# టెక్కలిలో 50 పడకల ఆయుష్ ఆసుపత్రి

మొదటిపేజీ తరువాయి

చేపట్టనున్నారు. ఈ ఆసుపత్రి ప్రారంభమైతే శ్రీకాకుళం జిల్లా ప్రజలకు ఆయుర్వేదం, యోగ, నేచురోపతి తదితర ఆయుష్ వైద్య సేవలు ఒకే వేదికపై అందుబాటులోకి రానున్నాయి. ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం దిశగా మంత్రి అచ్చెన్నాయుడు గారి నాయకత్వంలో టెక్కలి నియోజకవర్గం ముందుకు సాగుతోందనడానికి ఇది మరో స్పష్టమైన ఉదాహరణగా నిలుస్తోంది.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే ఎంజీఆర్




**నవతరం -పాతపట్నం**

పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు,పాతపట్నం మండలాలో పలువురు కుటుంబ సభ్యులు అనారోగ్యంతో బాధపడుతూ స్థానిక నాయుకుల ద్వారా స్థానిక శాసనసభ్యులు గౌరవ శ్రీ మామిడి గోవిందరావు గారి దృష్టికి తీసుకురాగా వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొరకు సిఫారసు చేసి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆ కుటుంబాలకు 2,40,323/- లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకునే ఆర్థికస్తోమత లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్న ప్రభుత్వం ఈ ఎన్డీఏ ప్రభుత్వం అని తెలియజేశారు.

పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా CMRF నిధులు అందిస్తున్నారు.

అలాగే ఈ నియోజకవర్గంలో గత పాలకులు ఏరోజైనా సీఎం సహాయనిది కోసం ఒక్క దరఖాస్తు అయిన చేయలేదని నియోజకవర్గ ప్రజలకు గుర్తు చేశారు.

# మందు ఒక్కటే మానవత్వం..!

మాయమైపోతున్నాడమ్మా
మనిషన్నవాడు
మచ్చుకైనా లేడు చూడు
మానవత్వమున్నవాడు అంటూ
వాపోయాడు ఆశుకవి అందెశ్రీ
గారు...

ఔను అరిషడ్వర్గాలనే
అంతర్గత దుర్గుణాలతో
మనిషి మలినమైపోతున్నాడు అవి
అంతరంగంలోఎగిసే ఆరని
అగ్నికణాలు...

నేడు ఎటువైపు చూసినాం
స్వార్థం కులం బలం అహంకారం
ఆశ్రిత పక్షపాతాలే
రాజ్యమేలుతున్నాయి
కుట్రలతో కుతంత్రాలతో
పగాప్రతీకారాలతో
అసూయాద్వేషాలతో
అక్రమాలకు పాల్పడుతూ మనిషి
అవినీతి ఊబిలో
కూరుకుపోతున్నాడు...

ధనదాహంతో
పదవీ వ్యామోహంతో
మనిషి విర్రవీగుతున్నాడు
అశాంతితో మనిషి రగిలిపోతున్నాడు
దుష్ట తలంపులతో
భ్రష్టుడైపోతున్నాడు...

కళ్ళు పొరలు కమ్మి కామంతో
మనిషి మృగంలా మారిపోతున్నాడు...

బుద్ధభూమిని యుద్ధభూమిగా
మారుస్తూ
రాజ్యకాంక్షతో రక్తపుటేరులు పారిస్తూ
మనిషి రాక్షసుడై పోతున్నాడు...

అందుకే అశాంతితో మనిషి లోలోపల
కుమిలి పోతున్నాడు కుళ్ళిపోతున్నాడు
దానికి “మందు ఒక్కటే
మానవత్వం”...

అందుకే...
ఓ మానవత్వమా నీవెక్కడంటే.?
ఆకలికి అలమటించే
అభాగ్యులను అనాథలను
విధవలాండ్రను ఆదుకునే
అమృతమూర్తుల ఆలోచల్లో
ఆపన్న అభయ హస్తాలలో
దాతృత్వపు గుణంలో...దాగి
నేనక్కడంటోంది...
మానవత్వం...

ఓ మానవత్వమా
నీవెక్కడంటే..?
నీడలేని నిస్సహాయులకు
కొండంత అండగా ఉండే
నిరుపేదలకు మేమున్నామని
తోడుగా నీడగా నిలిచే
నిస్వార్థపరులైన ధర్మమూర్తుల
సేవల్లో దైవత్వపు గుణంలో...
దాగి
నేనక్కడంటోంది...
మానవత్వం...

ఔను దానవత్వాన్ని దహనం
చేస్తే
మానవత్వం చిగురించే వసంతమే...
అందుకే యుద్ధవిమానాలతో
ఈ ధరణి దద్దరిల్లకుండా
ప్రతిచోటా ప్రశాంతత ప్రజ్వరిల్లేలా...

ప్రతి మనిషి మనసు నేలలో
స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు...
సమానత్వం సౌభ్రాతృత్వాలకు...
పునాదులైన దయా జాలి కరుణలనే
మానవత్వపు విత్తనాలను నాటుదాం..
ప్రతిగుండెలో ప్రేమపూలను
పూయిద్దాం...
విశ్వమంతా శాంతికపోతాల్ని
ఎగురవేద్దాం.

జైహింద్... జై భారత్...



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

## ముఖ్యమంత్రి సహాయనిధి

# పేదలకు వరం

- కూటమి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోంది
- ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మరియు నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన

**నవతరం నరసన్నపేట**

ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్)తో రాష్ట్రంలోని ఎందరో పేదల ప్రాణాలు కాపాడుతున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గారు అన్నారు.సోమవారం నాడు పోలాకి మండలం, కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి నరసన్నపేట నియోజకవర్గ నుండి 33 మంది లబ్ధి దారులకు రూ.21,00,700/- ఇరవై ఒక లక్ష ఏడు వందల రూపాయల చెక్కులను లబ్ధి దారులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని తెలిపారు.

రాష్ట్రంలో వైద్యం, విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్దిదారులు ముఖ్యమంత్రికి, గౌరవ శాసనసభ్యులు గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు ,ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# మెగా తనయగా ప్రీతి ముకుందన్

సరైన హీరోయిన్ దొరకాలే కానీ తెలుగు నిర్మాతలు వెదికి వెదికి మరీ చాన్స్ లు అందిస్తారు. ప్రీతి ముకుందన్ క్యూట్ ఫేస్ వున్న హీరోయిన్. ఓం భూమ్ బుష్, కన్నప్ప సినిమాల్లో నటించింది. ఆ సినిమాల సంగతి ఎలా వున్నా ఇప్పుడు రెండు మంచి చాన్స్ లు తలుపుతట్టాయి.

రోషన్ మేకా సరసన, శైలేష్ కొలను దర్శకత్వంలో సితార సంస్థ నిర్మించే సినిమాలో హీరోయిన్ ఆమె నే. ఈ రోజే వదిలిన గ్లింప్స్ లో ఇన్నాళ్లూ ఎక్కడుంది ఈ హీరోయిన్ అనేలా మేకోవర్ చేసి షూట్ చేసారు. ఇప్పుడు మరో చాన్స్ ఆ అమ్మాయికి వచ్చింది. మెగాస్టార్..బాబీ కాంబినేషన్ లో ఓ కీలకపాత్ర వుంది. మెగాస్టార్ డాటర్ పాత్ర అది. ఈ పాత్ర కోసం చాలా పేర్లు పరిశీలించారు. సార అర్జున్, అనశ్వర రాజన్, కీర్తి సురేష్ ఇలా చాలా పేర్లు. ఆఖరికి ప్రీతి ముకుందన్ పేరు ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది.

రెండు పెద్ద బ్యానర్లలో, రెండు పెద్ద సినిమాలు, వాటిల్లో కీలకపాత్రలు అంటే కెరీర్ టర్నింగ్ ఇచ్చుకున్నట్లే.

# మా సినిమాకు సీక్వెల్ లేదు బాబోయ్!

మొన్నటివరకు సీక్వెల్ ఓ ట్రెండ్. సినిమా చివర్లో పార్ట్-2 ఉందని ప్రకటిస్తే అదో కిక్కు. కానీ మెల్లమెల్లగా సీక్వెల్స్ కు దూరమౌతోంది టాలీవుడ్. తల బొప్పికట్టే రేంజ్ లో కొన్ని సినిమాలు చుక్కలుచూపించడంలో పార్ట్-2 ఎందుకు దండగ అనే ఫీలింగ్ కు వచ్చారు మేకర్స్. అటు ఆడియన్స్ కు కూడా మొహం మొత్తేసింది. చివరికి పరిస్థితి ఎలా వచ్చిందంటే, ఏదైనా సినిమాకు పార్ట్-2 ఉందని ప్రకటిస్తే, ఇంతోటి దానికి మళ్లీ అదో ముచ్చట అన్నట్టు పెదవి విరుస్తున్నారు. హైప్ సంగతి అటుంచి, ట్రోలింగ్ మొదలుపెట్టే రోజులొచ్చేశాయి.

అందుకే పెద్ద సినిమాలు జాగ్రత్త పడుతున్నాయి. తమ సినిమాలకు పార్ట్-2 ఉండదని, ఒకే సినిమాను ఆసాంతం ఆస్వాదించమని ఊరిస్తున్నాయి.

మొన్నటికిమొన్న వారణాసి సీక్వెల్ పై వచ్చిన ఊహాగానాల్ని ఖండిస్తూ, ఓ ఇంటర్వ్యూలో సుదీర్ఘంగా మాట్లాడాడు రాజమౌళి.

అన్ని సినిమాలకు సీక్వెల్స్ వర్కవుట్ కావంటూనే, తను తీస్తున్న వారణాసి సినిమా సింగిల్ గానే వస్తుందని, చివర్లో పార్ట్-2 లాంటి టైటిల్ కార్డులు పడవని విస్పష్టంగా ప్రకటించాడు. సీక్వెల్ ట్రెండ్ మొదలుపెట్టిన రాజమౌళినే, ఆ ట్రెండ్ నుంచి తప్పుకున్నట్టుంది. ఇక ది ప్యారడైజ్ సినిమా మేకర్స్





కూడా ఇదే విషయాన్ని ఒకటికి రెండు సార్లు చెప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. బడ్జెట్ ఎక్కువైందనో, సినిమాకు హైప్ పెంచడం కోసమో పార్ట్-2లు తీయడం సరైన పద్ధతి కాదని.. కథ డిమాండ్ చేయకుండా సీక్వెల్స్ తీయడం అనవసరం అంటూ స్వయంగా నిర్మాత గతంలో వెల్లడించాడు. తాజాగా ది ప్యారడైజ్ సినిమాకు సీక్వెల్ ఉండదని మరోసారి స్పష్టం చేసింది యూనిట్. సీక్వెల్స్ తీసే ప్రశాంత్ నీల్ కూడా ఈసారి ఆ ట్రెండ్ కు దూరంగానే ఉన్నాడు. ఎన్టీఆర్ తో డ్రాగన్ చేస్తున్న ఈ దర్శకుడు, ఆ సినిమాను సింగిల్ మూవీగానే తెరకెక్కిస్తున్నాడు. చూస్తుంటే, తెలుగులో ఈ సీక్వెల్స్ గోల తగ్గేలానే ఉంది.

# ఐతంలోజాతీయ స్థాయి 'చతుర-2026' పోస్టర్ ఆవిష్కరణ

### డైరెక్టర్ ప్రొ. వివి నాగేశ్వరరావు




**నవతరం టెక్కలి**

టెక్కలి సమీపంలోని ఐతం ఇంజనీరింగ్ కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో ఈ నెల 27, 28 తేదీలలో నిర్వహించనున్న జాతీయ స్థాయి 'చతుర--2026' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'చతుర--2026' కార్యక్రమం ఎంబీఏ మరియు బీబీఏ విభాగాల విద్యార్థుల సమన్వయంతో నిర్వహించబడుతుందని, ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ గుణాలు, నిర్వహణ నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచనలు మరింత పెంపొందుతాయని తెలిపారు.
ఈ కార్యక్రమానికి మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి డా. కె.ఎల్. శ్రీకాంత్ కన్వీనర్‌గా, డి.ప్రణయ సహా కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. విద్యార్థుల తరఫున ఆర్. మౌనిక, వి. ప్రవీణ, కె. ప్రవీణ్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.
ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్. శ్రీనివాసరావు, ప్రొఫెసర్ డా డి. విష్ణుమూర్తి, డా శివకుమార్, డా కె.వేణుగోపాల్, డా వి. గోపాల్ క్రిష్ణ, శివనాగేష్. తో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

# నేతన్న నేస్తాలను హామీలను వెంటనే అమలు చేయాలి

**నవతరం-లావేరు**

రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ఎన్నికలు ముందు ఇచ్చిన 200 యూనిట్లు ఉచిత విద్యుత్తును, నేతన్న నేస్తాలను హామీలను వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వి. రమణ డిమాండ్ చేశారు. సోమవారం లావేరు లో చలో మంగళగిరి చేనేత గర్జన పోస్టర్ ను చేనేత కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వ్యవసాయం తర్వాత అత్యంత ఎక్కువ మంది ఆధారపడి జీవిస్తున్న చేనేత రంగం పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు 200 యూనిట్లు విద్యుత్ అమలు చేస్తామని, అలాగే అర్హులైన వారందరికీ నేతన్న నేస్తాన్ని అమలు చేస్తామని, 50 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ అమలు చేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిని అమలు చేయకుండా చేనేత కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్.భీమరావు, డి.వెంకట్, వి.వీరాస్వామీ, యు.వీర్రాజు,కె.గోవిందరావు, కె. లక్ష్మీ, కె.ఆది లక్ష్మీ, ఎ.గడడయ్య, ఎన్.రుద్రయ్య, ఎ.సూరి, టి.రమణ, యు.శంకరయ్య, ఎ.తాతారావు, కె.రామోజీ, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర సంఘం పిలుపుతో మందసలో వీఆర్‌వోలకు నిరసన

### హక్కుల సాధనకు ఐక్యంగా పోరాటం



**నవతరం-మందస**

రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మందస మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారులు సోమవారం, నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ సేవా భద్రత, హక్కులు మరియు సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాన్ని అప్రమత్తం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు.
నిరసన కార్యక్రమంలో వీఆర్‌వో సంఘం అధ్యక్షుడు పాండవ గజపతి మాట్లాడుతూ, ప్రభుత్వానికి తమ న్యాయమైన డిమాండ్లు త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యక్షుడు మల్లేన నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగానే నిరసన నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం. హేమరాజు, ఎం. క్రాంతి, ఎం. నగేష్, గౌరి సురేష్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వీఆర్‌వోలు జుఫ్ఎష్ట్ర సంఖ్యలో హాజరై తమ ఐక్యతను చాటుకున్నారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు

# ఆల్డిజి ప్రాంగణ నియామకాలలో కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల హవా

**నవతరం - శ్రీకాకుళం**



కొలువులకు సరైన వేదిక కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల అని డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి,ప్రిన్సిపాల్ కె శివశంకర్ తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ డిగ్రీ పట్టా అందుకోకముందే 113 మంది విద్యార్థులు ఆల్డిజి ప్రాంగణ నియామకాలలో ఉద్యోగాలు సాధించడం శ్రీకాకుళం విద్యావ్యవస్థలో చరిత్ర సృష్టించామన్నారు కాబట్టి ఇంటర్ తర్వాత ఎం చేయాలనీ ఆలోచించకుండా డిగ్రీలో తమ పిల్లలను జాయిన్ చేసి వారి ఉజ్వల భవిష్యత్ కు దోహదపడాలని తల్లితండ్రులను చూసించారు. ప్రస్తుతం ఇంజనీరింగ్‌కు దీటుగా కార్పొరేట్ కొలువులను డిగ్రీ మీద అందిస్తున్నామన్నారు ఇందుకు కారణం డిగ్రీ మొదటి సంవత్సరం నుండే ఉద్యోగాలకు ఉపయోగపడే క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతోందన్నారు,అదేవిదంగా ప్రస్తుత రోజులలో సాఫ్ట్వేర్ రంగాలలో ఎంతో ప్రాధాన్యత ఉన్న కోడింగ్ పైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం అని, ఇవి విద్యార్థినిలకు ఉద్యోగాలు సాధించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి అన్నారు.
వీటితో పాటు ప్రతీ విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు.
క్యాంపస్ కొలువులే కాకుండా అకడమిక్ పైన కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టి యూనివర్సిటీ స్థాయి పరీక్షా ఫలితాలలో మొదటి స్థానాలలో ఉంటున్నాం అన్నారు కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె వేణు,ప్లేస్ మెంట్ అధికారి ఎల్ ప్రసాద రావు పాల్గొన్నారు.

- మరణానంతరం ప్రాణదాతగా పారినాయుడు
- అవయవ దానంతో పలువురికి ప్రాణం
- పారినాయుడు అవయవ దానం ఆదర్శం
- మరణానంతరం జీవించిన మహాదాత
- ప్రాణాలను నిలిపిన అవయవ దానం

# అవయవ దానం మహాదానం పారినాయుడు ప్రాణదానం






**నవతరం-వంగర**

వంగర మండలం కొత్తవలస గ్రామానికి చెందిన పెంకి పారినాయుడు అవయవ దానం ద్వారా పలువురికి ప్రాణదాతగా నిలిచారని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ కొనియాడారు. ఇటీవల అస్వస్థతకు గురై శ్రీకాకుళం జేమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన పారినాయుడు అవయవాలను ఆయన కుటుంబ సభ్యులు దానం చేయడం సమాజానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.
శుక్రవారం పారినాయుడు మృతదేహానికి ఎంపీపీ సురేష్ ముఖర్జీ నివాళులు అర్పించి మాట్లాడుతూ, అవయవ దానం ద్వారా మరణానంతరం కూడా పలువురి ప్రాణాలను నిలబెట్టే గొప్ప సేవ చేశారని అన్నారు. పారినాయుడు చేసిన ఈ మహోన్నత కార్యం సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తుందని, ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. అవయవ దానం ద్వారా ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపిన పారినాయుడు నిజమైన మహాదాతగా నిలిచారని, ఆయన మరణించినప్పటికీ సజీవంగా ఉన్నట్లేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్యకుమార్, గుడివాడ గోవిందరావు, పెంకి గౌరు నాయుడు, పెంకి సత్యం మాస్టారు, పెంకి పోలిరాజు, పెంకి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

- డి. ఆర్. ఓ, ఎస్. వి. లక్ష్మణమూర్తి
- 94 అర్జీలు స్వీకరణ

# అర్జీలు పెండింగ్ లేకుండా త్వరితగతిన పరిష్కరించాలి

**నవతరం - శ్రీకాకుళం**



అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి, ఎస్వీ. లక్ష్మణమూర్తి, జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు, (పి.జి.ఆర్.యస్) పరిష్కార వేదికలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, పద్మావతి మరియు జయదేవితో కలసి ఆయన అర్జీదారుల నుండి అర్జీలు స్వీకరించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలు పెండింగ్ లో లేకుండా తగు పరిశీలన చేసి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలు సమస్యలకు సంబంధించి వివిధ శాఖలకు పరిష్కారం కోరుతూ వచ్చిన 94 అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ-(జజూూా)36, సర్వే మరియు ల్యాండ్ రికార్డ్స్ సెటిల్మెంట్స్ కోరుతూ 11,సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పవర్టీ-8, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్-5, పంచాయతీరాజ్ 4, ఎపిఈపీడిసియల్-4 , పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ 3, వాటర్ రిసోర్స్ 3, రోడ్లు మరియు భవనాల శాఖ 3, పోలీస్ శాఖ 2, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ 2, మైన్స్ అండ్ జియాలజీ 2, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ 1, సోషల్ వెల్ఫేర్ 1, యానిమల్ హస్బెండ్రి 1, ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ 1, గ్రామ, వార్డు మరియు విలేజ్ సెక్రటేరియట్ వార్డు సెక్రటరీ 1, రూరల్ డెవలప్మెంట్ 1, ఉమెన్ డెవలప్మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ 1, వికలాంగుల శాఖ 1, స్కిల్ డెవలప్మెంట్ 1, రూరల్ వాటర్ సప్లై 1, వ్యవసాయ శాఖ 1, అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి మాట్లాడుతూ ఇప్పటివరకు వివిధ శాఖలలో పెండింగులో ఉన్న అన్ని (పి.జి.ఆర్ .యస్) ఫిర్యాదులు వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. అర్జీలు స్వీకరణలో జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, పద్మావతి, జయదేవి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**